నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 14 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

పెబ్బేరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

రైతులు వరిగోస పడ్తుండ్రు

- గన్నీ బ్యాగులు, లారీలు లేవని కొర్రీలు పెట్టొద్దు
- రాస్తారోకోలో బీఆర్ఎస్ నేతలు

పెబ్బేరు, మే 13 : ధాన్యం కొనుగోళ్లు ఒక ప్రహసనంగా మారాయని, అధికారులు రైతులకు అడుగడుగునా నరకం చూపిస్తున్నారని ఆరోపిస్తూ ధాన్యం కొనుగోలు చేప ట్టాలని కోరుతూ మంగళవారం పెబ్బేరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మండల బీఆర్ఎస్ నాయకులు కర్రెస్వామి, జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతుల ఉసురు తీస్తోందని మండిపడ్డారు. ధాన్యాన్ని తెచ్చి రోజులు గడుస్తున్నా సాకులు చూపుతూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు లేవని, లారీలు లేవని గోస పెడుతోందని, దినాల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులను పడిగాపులు కాచేల చేస్తోందని, తీరా తూకం సమయంలో తరుగు పేరిట నాలుగైదు కిలోలు తక్కువగా చూపుతున్నారని ఆరో పించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రైతులను అక్కున చేర్చుకుంటే, ఇప్పుడు వారిని రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎప్పుడూ రైతులు ఇంతగా అవస్థలు పడి ఉండరని, వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని కొనుగోళ్లు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, నాయకులు రాజశేఖర్, ఎల్లారెడ్డి, ఎల్లయ్య, పార్వతి, గోవిందు, వీర స్వామి, విశ్వ రూపం, మజీద్, శాంతయ్య, మన్యం, గోవర్ధన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ఆయిల్‌పాం తోటను పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఆయిల్‌పామ్‌తో దీర్ఘకాల ఆదాయం

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- ఆరుతడి పంటల సాగుకు అవకాశం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 13 : ఆయిల్‌పాం తోటల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఆర్జించవచ్చని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి మండలంలోని అచ్యుతాపురంలో రైతు బోయిని వాసు 4ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటను మాజీ మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం తన హయాంలో ఆయిల్‌పాం తోటలపై రైతులకు అవగాహన కల్పించి సాగు దిశగా ప్రోత్సహించినట్లు గుర్తుచేశారు. ఆయిల్‌పాం తోటల వల్ల రైతులు దీర్ఘకాల ఆదాయం పొందవచ్చని, అదేవిధంగా అంతర్గత పంటలు వేసుకొని జీవనోపాధి పొందవచ్చన్నారు. మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వల్ల భూసారం పెరగడం తోపాటు అధిక దిగుబడిని సాధించే వీలుంటుందని వివరించారు. అనంతరం ఆయిల్‌పాం సాగు చేసిన రైతులను అభినందించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శారద, ఆశన్ననాయుడు, నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

ఇప్పటూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- దాహార్తి తీర్చాలని ఇప్పటూరు వాసుల డిమాండ్

నవాబ్‌పేట, మే 13 : గత కొంత కాలం నుంచి మా గ్రామంలోని రెండు వార్డులకు మిషన్ భగీరథ నీరు రావడం లేదు.. ఉన్న రెండు బోరు మోటర్లు కూడా పని చేయడం లేదు.. మండుటెండల్లో తాగునీటికి తంటాలు పడుతున్నాం.. అయినా అధికారు లెవరూ పట్టించుకోవడం లేదంటూ.. నవాబ్‌పేట మండలం ఇప్పటూర్ గ్రామస్థులు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే... ఇప్పటూర్ గ్రామంలోని బస్టాండ్ ఏరియాలోని రెండు వార్డులకు కొంత కాలం నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. అక్కడి వార్డుల్లో పైప్‌లైన్ వ్యవస్థ సక్రమంగా లేనందున మిషన్ భగీరథ నీరు రావడం లేదు. పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని, లేదంటే ఆయా వార్డుల్లో ఉన్న బోర్లను రిపేరు చేయించాలని.. గతంలో గ్రామస్థులు ప్రత్యేకాధికారికి, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదు. దీంతో విసిగి పోయిన గ్రామప్రజలు ఖాళీ బిందెలతో బస్టాండ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చాలా రోజుల నుంచి నీటి ఎద్దడి ఉందని, అధికారు లెవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ చౌరస్తాలో రెండు బోర్లు ఉన్నాయని, అందులో ఒక మోటరు బోరు బావిలోనే పడిపోయిందని, మరో బోరు మోటరు రిపేరు చేయించడానికి అవకాశం ఉన్నా చేయించడం లేదని, నీటి కోసం ఇతర కాలనీలకు, వ్యవసాయబోరు బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోందని వారు ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కల్పనను వివరణ కోరగా.. పాత పైప్‌లైన్ ఉన్న కారణంగా ఆయా వార్డులకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని తెలిపారు. త్వరలోనే సింగిల్ ఫేజ్ మోటరు బిగించి నీటిని అందిస్తామని చెప్పారు.

సినీ ఫక్కీలో చోరీ

- బస్సు ఎక్కుతుండగా మహిళ బ్యాగులోంచి రూ.3.50 లక్షలు కొట్టేసిన దొంగలు

మక్తల్, మే 13 : ఓ మహిళ బ్యాగులోంచి రూ.3.5 లక్షలు సినీ ఫక్కీలో కొట్టేసిన ఘటన మంగళవారం ఉదయం మక్తల్ పట్టణంలో చోటు చేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ పట్టణానికి చెందిన ఉప్పరి మహేశ్వరి మహిళా సంఘం నుంచి రూ.3.5 లక్షలు రుణం తీసుకొని తన చెల్లికి ఇవ్వడానికి మంగళవారం ఉదయం 8:40 గంటలకు యాదగిరి వెళ్లేందుకు మక్తల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్నది. ఈ క్రమంలో దుండగులు సదరు మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి సినీ ఫక్కీలో నగదును అపహరించారు. సదరు మహిళ వెంటనే పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

'మురికి'పాలిటీ

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాటర్ ట్యాంక్ కాలనీ సమీపంలో ఇండ్ల మధ్య దుర్గంధం వెదజల్లుతున్నది. ప్రధాన రోడ్డుకు సమీపంలో ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా పాలకులుగానీ.. ఇటు అధికారులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం చెందుతున్నారు.

– ఫొటోగ్రాఫర్, జోగుళాంబ గద్వాల

జటప్రోల్‌లో రైతుల ధర్నా, నిలిచిపోయిన వాహనాలు

తడిచిన ధాన్యం కొనాల్సిందే..

- వర్షానికి తడిచి నష్టపోయాం
- రెండ్నెళ్లుగా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నాం
- రాస్తారోకోలో రైతన్నల ఆగ్రహం
- పెంట్లవెల్లిలో రోడ్డుపై ముళ్లకంప వేసి ఆందోళన

రోడ్డుపై కంప వేసి రైతుల నిరసన

పెంట్లవెల్లి, మే 13 : రైతులు ఆరుగాలంగా కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి రెండు నెలలు గడిచినా కొనుగోలు చేయలేదు. ఈ క్రమంలో సోమవారం కురిసిన అకాల వర్షానికి తడిచి ముద్దయిన ధాన్యాన్ని చూసి తట్టుకోలేక తడిచిన బస్తాలతోపాటు కంప చెట్లు పెబ్బేరు–కొల్లాపూర్ రోడ్డుకు అడ్డంగా వేసి దాదాపు 100 మంది రైతులు రాస్తా రోకోకు దిగిన ఘటన పెంట్లవెల్లి మండలం జటప్రోలులో మంగళవారం చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జటప్రోలులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు నెలల కిందట ధాన్యాన్ని తీసుకుచ్చినట్లు తెలిపారు. అయితే మ్యాచర్ వచ్చే వరకు ధాన్యాన్ని ఆర బెట్టాలని మహిళా సమాఖ్య సభ్యులు రైతులకు సూచించారు. రెండు నెలలు గడిచినా తమ ధాన్యాన్ని మ్యాచ్చర్ పేరుతో కొనుగోలు చేయకుండా ఐకేపీ అధికారులు రైస్‌మిల్లర్లతో చేతులు కలిపి ధాన్యానికి కాంటా వేయడం లేదని ఆరోపించారు. ఈ కారణంగానే సోమవారం కురిసిన వర్షానికి ధాన్యం మొత్తం తడిచి ముద్దయ్యిందని ఇప్పుడెలా అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో రైతులకు పెద్దపీట వేశారని, కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసేవారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చినా అనేక కొర్రీలు పెట్టి ధాన్యం కొనుగోలు చేయకుండా నెలల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాసేలా చేస్తున్నారని, ధాన్యం అమ్మిన డబ్బులు కూడా సకాలంలో అందించడం లేదని మండిపడ్డారు. జిల్లాకు చెందిన వ్యక్తి సీఎంగా ఉన్నారని, ఈ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నా రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా తడిచిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రామన్‌గౌడ్, ఏపీఎం గౌస్ అక్కడికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి తడిచిన దాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు నచ్చచేపడంతో రాస్తా రోకో విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్‌కే ఖాజా, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డితో పాటు గ్రామానికి చెందిన రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు
- మొత్తం 12,104 అభ్యర్థులకు 11,478 మంది హాజరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 13: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి తెలంగాణ సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీ పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సజావుగా సాగింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్షను నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు కేంద్రాల్లో పరీక్షను నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు తెలిపారు. మొత్తం 5 కేంద్రాల్లో 3381 మంది అభ్యర్థులకు గానూ 3190 హాజరుకాగా 191 మంది గైర్హాజరయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలో 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 2756 మంది విద్యార్థులకు గానూ 2592 మంది హాజరుకాగా 164 మంది గైర్హాజరయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోనూ నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 1780 మంది విద్యార్థులకు గానూ 1702 హాజరుకాగా 78 మంది గైర్హాజరయ్యారు. నారాయణపేట జిల్లాలోనూ నారాయణపేట పట్టణంలో మూడు, కోస్గిలోని రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు 1382 మంది విద్యార్థులకు గానూ 1302 మంది హాజరుకాగా 79 మంది గైర్హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 9 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 2805 మంది విద్యార్థులకు గానూ 2,629 మంది హాజరుకాగా 176 మంది గైర్హాజరయ్యారు.

హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

వీపనగండ్లలో ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో చేస్తున్న రైతులు

- రాస్తారోకోలో చిక్కుకున్న తాసీల్దార్‌ను నిలదీసిన కర్షకులు

తాసీల్దార్ వరలక్ష్మిని నిలదీస్తున్న రైతులు

వీపనగండ్ల, మే 13 : ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కొనుగోలులో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో రైతులు రాస్తా రోకోనిర్వహించారు. ఈ రాస్తా రోకోలో చిక్కుకున్న తాసీల్దార్ వరలక్ష్మి వాహనాన్ని రైతులు అడ్డుకొని ధాన్యం కొనుగోళ్లపైనిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల దగ్గర నిల్వచేసి నెలల తరబడి కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో తేమ శాతం పూర్తిగా తగ్గిపోతున్నదని వాపోయారు. రైతులు నష్టపోవడం కోసం రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులు కలిసి కాలయాపన చేస్తున్నారని, రైసు మిల్లర్లు తాలు పేరుతో 40 కేజీల బస్తాకు 3 కేజీల పైన తరుగు తీస్తూ దారుణంగా మోసాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యానికి సరిపడ గన్నీ బ్యాగులు సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో మండలంలో ఇప్పటి వరకు కనీసం 20 శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని రైతులు ఆరోపించారు. ఐకేపీతో పాటు గతంలో వలే తూంకుంట సింగిల్‌విండో సొసైటీ ద్వారా కూడా ధాన్యాన్ని విక్రయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, వెంకట్ రెడ్డి, సర్వారెడ్డి, ఊశన్న, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఒప్పుకొంటేనే..

- ప్రాజెక్టుకు భూములు అప్పగిస్తాం
- అధికారులకు తేల్చిచెప్పిన రైతులు

అధికారులకు సమస్యలను విన్నవిస్తున్న రైతులు

ఊట్కూర్, మే 13 : నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంలో కోల్పోతున్న భూములకు ఎకరాకు రూ.60 లక్షల పరిహారం తోపాటు ఇంటికో ఉద్యోగం ఇస్తేనే మా భూములను అప్పగిస్తామని రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. మంగళవారం ఆర్డీవో రాంచందర్ ఆధ్వర్యంలో నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల భూ సర్వే సందర్భంగా నిర్వహించిన గ్రామసభ రసాభాసగా సాగింది. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించాల్సిన గ్రామసభకు ఆర్డీవోతో పాటు సంబంధిత శాఖల అధికారులు మధ్యాహ్నం ఒంటిగంటకు స్థానిక గ్రామ పంచాయతీ వద్దకు చేరుకొని సభను ప్రారంభించారు. అధికారులు ముందస్తుగా గ్రామసభను నిర్వహించడంతో సరైన సమాచారం లేక దంతన్‌పల్లి శివారుకు చెందిన కొద్ది మంది మాత్రమే హాజరుకాగా రైతులను మభ్య పెట్టేందుకే గ్రామసభను నిర్వహిస్తున్నారని అధికారులతో వాదనకు దిగారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఓపెన్ కెనాల్, పైప్‌లైన్ ద్వారా భూములు కోల్పోతున్న రైతులతో ఇప్పటికే పలు సందర్భాల్లో సమావేశం నిర్వహించి నష్టపరిహారం చెల్లించే విషయంలో స్పష్టత ఇవ్వలేదని, ఎకరాకు రూ.60 లక్షల పరిహారం తోపాటు ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. తాము కోరిన పరిహారం కంటే తక్కువ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో భూములను అప్పగించమని వారు తేల్చిచెప్పారు. తమ విలువైన వ్యవసాయ భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకునేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోపక్క ఊట్కూర్ పెద్ద చెరువు సాగునీటి కెపాసిటీని పెంచి రిజర్వాయర్‌గా మార్చేందుకు అధికారులు కొలతలు చేస్తున్నారని, ఈ విషయమై రైతులకు ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని శివారు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు విస్తీర్ణంపై రైతులు, గ్రామస్తులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైతులకు సరైన సమాధానం చెప్పలేక అధికారులు అరగంటలోనే గ్రామసభను ముగించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవి, ఎంపీడీవో ధనుంజయగౌడ్, ఆర్ఐ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా జూరాల కాల్వలు

- పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న రైతులు

జూరాల ఎడమ ప్రధాన కాల్వలో నీళ్లు వెళ్లకుండా పేరుకుపోయిన రాళ్లు

శిథిలావస్థకు చేరుకున్న డిస్ట్రిబ్యూటరీ కాల్వ

పెబ్బేరు, మే 13 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలో వ్యవసాయ రంగానికి సాగు నీరందించే కాల్వల పరిస్థితి దయనీయంగా మారింది. నిర్వహణ లోపం, అజమాయిషీ కొరవడంతో చాలాచోట్ల దెబ్బతిన్నాయి. దీంతో నీరు సరిగా ముందుకు పారక ఆయకట్టు సాగుపై ప్రభావం చూపుతున్నది. కొన్ని చోట్ల కాల్వలు శిథిల దశకు చేరుకున్నప్పటికీ అధికార యంత్రాంగంలో చలనం కనిపించడం లేదు. అప్పుడప్పుడూ తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల డ్యాం నుంచి కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా పంట పొలాలకు సాగునీరందుతున్నది. వీటి పరిధిలో డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాల్వల ద్వారా ఆయకట్టుకు చేరుతున్నది. ప్రధాన ఎన్టీఆర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు నుంచి పెబ్బేరు మీదుగా కొల్లాపూర్ చివరి వరకు వంద కిలోమీటర్ల మేర సాగుతున్నది. దీని పరిధిలో సుమారు లక్ష ఎకరాలు సాగవుతున్నది. ఎడమ కాల్వ నుంచి డిస్ట్రిబ్యూటరీలకు, తర్వాత మైనర్ కాల్వల ద్వారా చెరువులు, కుంటలకు నీరు వెళ్తున్నది. వీటి ద్వారా పంటలకు నీరు చేరుతుండగా, కొన్ని చోట్ల నేరుగా కాల్వల నుంచే పొలాలకు నీరందుతున్నది.

నీళ్లు ముందుకు పారక..

జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరందాలంటే కాల్వలే ప్రధానం. చాలా చోట్ల కాల్వల పనితీరు తీసికట్టుగా ఉంటోంది. కాల్వలకు ఇరువైపులా గోడలకు ఉండే లైనింగులు ఊడిపోయి, కాల్వల్లో మట్టి చేరడంతో నీళ్లు ముందుకు పోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కాల్వల నిర్మాణం దెబ్బతిని కొన్నిచోట్ల శిథిల దశకు చేరుకున్నాయి. కాల్వల్లో పెద్ద ఎత్తున చెట్లు పెరిగి నీటి ప్రవాహానికి అవరోధం కల్గిస్తున్నాయి. అలాగే, కాల్వల్లో పెద్ద ఎత్తున రాళ్లు పేరుకపోయి నీళ్లు ముందుకు పోకుండా అడ్డుపడుతున్నాయి. కొన్ని చోట్ల రైతులు అక్రమంగా కాల్వకు రంధ్రాలు చేసి నీటిని తరలించుకపోతున్నా పట్టించుకోవడం లేదు. ఇలా ఎన్నో రకాల ఆటంకాలు కలుగుతున్నా.. అధికారులు స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

అరకొర నిధులతో పనులు

ప్రతి వేసవిలో మూడు నెలల పాటు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాను నిలిపి వేడయం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో పంటవిరామాన్ని ప్రకటిస్తారు. ఈ ఖాళీ సమయంలోనే కాల్వల మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఆ దిశలో యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదు. అక్కడక్కడా అరకొర పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ కారణంగా వర్షాకాలంలో ప్రాజెక్టు నుంచి నీళ్లు వదిలిన వెంటనే కొన్నిచోట్ల కాల్వలు తెగిపోతుంటాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. నీటి పారుదల శాఖ అధికారులు నిత్యం కాల్వల వెంట తిరిగి సమస్యలున్న చోట సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి

జూరాల కాల్వ నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి. నీటి ప్రవాహానికి కాల్వలు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి ఆటంకాలు లేకుండా కాల్వల్లో నీరు సాఫీగా పారే విధంగా చర్యలు చేపట్టాలి. అవసరమైన చోట మరమ్మతులు చేయాలి. కాల్వలపై అధికారులు నిత్యం పర్యవేక్షణ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- శివరాజు, రైతు, బునియాదిపురం

మరమ్మతులకు ప్రతిపాదనలు

జూరాల కాల్వల మరమ్మతుకు గతేడాది ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరి చేసింది. ఆ నిధులతో కొన్ని చోట్ల పనులు చేపట్టాం. ఈ పర్యాయం మాత్రం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద అన్నిరకాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన చోట చేపట్టాల్సిన పనుల గురించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కాల్వలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. సకాలంలో నిధులు విడుదలైతే వానకాలంలోగా పనులు పూర్తి చేస్తాం.

- జగన్మోహన్‌రెడ్డి, ఈఈ, జూరాల ప్రాజెక్టు